సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం । 29 । ఆగస్టు । 2025



నలుతెరంగులా వ్యవహరిద్దాం

తెలుగు భాష తీయదనం.. తెలుగు భాష గొప్పదనం.. తెలుసుకున్న వాళ్లకి తెలుగే ఓ మూలధనం.. అన్నాడో సినీ కవి. పంచ దారకన్నా మధురమైనది మన తెలుగు.

8లో



సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

ఆరోగ్యవంతమైన గ్రామాన్ని నిర్మించాల్సిన బాధ్యత జిల్లా స్థాయి అధికారులపై ఉన్నదని విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ అన్నారు.

8లో

ఆయువు తీసిన విద్యుత్ పాశాలు



విద్యుత్ స్తంభంపై మరమ్మత్తులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో ఒక లైన్‌మెన్ మృతి చెందగా, మరో లైన్‌మెన్ తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం పట్టణంలో చోటు చేసుకున్న ఘటనపై సీఐ విజయశంకర్, ఎస్‌ఐ మౌనిక తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ న్యాయ విభాగ జిల్లా అధ్యక్షుడిగా సీపీఆర్ రెడ్డి



రమాకాంత్‌రెడ్డి

సాక్షి, రాజమహేంద్రవరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానికి చెందిన సీపీఆర్ రెడ్డిని వైఎస్సార్ సీపీ న్యాయవిభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు వెలువరించింది. పదవి వచ్చేందుకు సహకరించిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుకు రమకాంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవికి ఎంపిక చేసిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

దేవీ నవరాత్ర మహోత్సవానికి పందిరి రాట



పాల్గొన్న మాజీ మంత్రి శంకర నారాయణ, మాజీ ఎంపీలు భరత్, మాధవ్ తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): స్థానిక దేవీచౌక్‌లో వేంచేసియున్న శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలకు పందిరి రాట ముహూర్తం గురువారం ఉదయం 11 గంటలకు ఘనంగా జరిగింది. ముందుగా శ్రీ దేవీ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బత్తుల రాజ రాజేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఆకుల వెంకటేశ్వరరావులతో ఆలయ ప్రధాన అర్చకుడు దొంతంశెట్టి శ్రీ కాశీహస్తీశ్వరరావు పందిరి రాటకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహింపజేశారు. దేవీచౌక్ శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అమ్మవారి దసరా ఉత్సవాల ఏర్పాట్ల కోసం గురువారం ఉదయం నిర్వహించిన రాట ముహూర్తం కార్యక్రమంలో మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ పాల్గొని కొబ్బరికాయ కొట్టారు. మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ, మాజీ పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్ కూడా రాట ముహూర్త కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఏపి హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిళారెడ్డి, చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన

పిఠాపురం: డీఎస్సీ సాధించిన వారి ధ్రువపత్రాల పరిశీలన పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు అబ్జర్వర్, ఏపీ విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ మువ్వ రామలింగం తెలిపారు. ఆయన గురువారం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కేంద్రంలో 1,351 మంది సర్టిఫికెట్లు పరిశీలించాల్సి ఉండగా తొలి రోజు గురువారం 1,029 మంది తమ సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. వారిలో గురువారం రాత్రి 10 గంటలకు 750 పైగా పూర్తయ్యాయి. మిగిలినవి శుక్రవారం పరిశీలించనున్నారు. ఆయన వెంట డీఈవో రమేష్ డీసీఈబీ వెంకట్రావు ఉన్నారు.

బార్లపై కూటమి.. సిండికేట్ కన్ను!



- దక్కించుకునేందుకు ఎత్తుగడలు
- పర్మిట్ రూములు, బెల్ట్ షాపులు అధికంగా ఉన్నాయంటూ పైకి కలరింగ్
- అంతర్గతంగా మాత్రం సింహభాగం షాపులు కైవసం చేసుకునేందుకు పావులు
- లైసెన్సు ఫీజు తగ్గించుకొని బార్లు హస్తగతం చేసుకునేందుకు ఎత్తులు
- అందులో భాగంగానే బార్లకు దరఖాస్తు చేయకుండా కాలయాపన

సాక్షి, రాజమహేంద్రవరం: **బార్లు దక్కించుకునేందుకు కూటమి సిండికేట్ కుయుక్తులు పన్నుతోందా.? ప్రభుత్వం నిర్ధారించిన ఫీజులు భారీగా తగ్గించుకునేందుకు కుట్రలు చేస్తోందా? ఇందులో భాగంగా మద్యం వ్యాపారులు ఒక్కటైపోయారా? ప్రభుత్వానికి చెల్లించాల్సిన బార్ లైసెన్స్ ఫీజులు తగ్గించే వరకు దరఖాస్తులు చేయకూడదని నిర్ధారించుకున్నారా? ఈ నెల 26వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు ఉండగా జిల్లావ్యాప్తంగా 25 బార్లకు కేవలం 8 దరఖాస్తులే రావడం ఇందుకు బలం చేకూరుస్తోందా..? అంటే అవుననే సమాధానం వస్తోంది ప్రజల నుంచి. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బార్ల లైసెన్సుల ఎంపికపై టీడీపీ, జనసేన, బీజేపీల సిండికేట్ కన్నేసింది. ప్రభుత్వం అర్బన్ ప్రాంతాల్లో బార్ ఫీజు ఏకంగా ఏడాదికి రూ.70 లక్షల నిర్ధారించడంపై గుర్రుగా ఉంది. ఎలాగైనా ఫీజు తగ్గించుకొని లాభం పొందేందుకు తెరవెనుక కుట్రలు ప్రారంభించింది. ప్రధానంగా అర్బన్ ప్రాంతాల్లో దరఖాస్తులు చేయ**కుండా మిన్నకుండి పోయినట్లు సమాచారం. దీంతో ఎక్సైజ్ అధికారులు స్పందన రాలేదంటూ ప్రభుత్వానికి నివేదికలు పంపితే.. ప్రభుత్వం దరఖాస్తులు రాలేదన్న నెపంతో ఫీజులు తగ్గించి కూటమి నేతలకు లాభం చేసే ఎత్తుగడ వేసినట్లు తెలిసింది. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడినా.. కూటమి సిండికేట్ మాత్రం కాసులు కొల్లగొట్టనుంది. లోలోపల ఈ కుట్రలకు తెర తీసిపైకి మాత్రం పర్మిట్ రూములు, బెల్ట్ షాపులు అత్యధికంగా ఉండడంతో తాము వ్యాపారం చేయలేమంటూ కూటమి నేతలకు చెందిన సిండికేట్ కలరింగ్ ఇస్తున్నట్లు సమాచారం.

జిల్లాలో 25 బార్లు

జిల్లావ్యాప్తంగా మొత్తం 25 బార్లు ఉన్నాయి. వాటిలో 3 బార్లు కల్లుగీత కార్మికులకు రిజర్వ్ చేయగా.. మిగిలినవి ఓపెన్ కేటగిరిలో కేటాయిస్తారు. ఇందులో రాజమహేంద్రవరంలో 19, కొవ్వూరు 2, నిడదవోలు 3 బార్లు ఉండగా.. తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం టూరిజం ప్రదేశాల్లో బార్లకు అనుమతులు ఇస్తున్నారు. కడియపులంకలో ఒక బార్‌కు అనుమతులు ఇవ్వనున్నారు.

దరఖాస్తుల ఆహ్వానానికి స్పందన కరవు

జిల్లావ్యాప్తంగా 25 బార్లకు లైసెన్సు ఇచ్చేందుకు వ్యాపారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ నెల 26వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని అబ్కారీ శాఖ అధికారులు గడువు పెట్టారు. 25 బార్లకు గాను కేవలం ఎనిమిది దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అది కూడా.. 8 బార్లకు మాత్రం ఒక్కో బార్‌కు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు అందాయి. రాజమహేంద్రవరం నగరం నుంచి నాలుగు దరఖాస్తులు రాగా, మిగిలిన ప్రాంతాల నుంచి నాలుగు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. మిగిలిన వాటికి దరఖాస్తు చేసుకునే నాథుడే కరవయ్యాడు. దీంతో అవాక్కైన ఎక్సైజ్ అధికారులు తిరిగి నెల 29వ తేదీ వరకు గడువు పెంచారు. ప్రతిపాదించిన మేరకు 25 బార్ల లైసెన్సులను రాబట్టాలని అధికారులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి అధికారులకు టార్గెట్లు ఉండటంతో.. వీటిని పూర్తి చేసేందుకు వారు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మరోమారు దరఖాస్తుల స్వీకరణకు సమయం ఇస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ వెల్లడించారు. ఆరోజు సాయంత్రం 6 గంటల లోపు వ్యాపారులు తమ దరఖాస్తులను నేరుగా కార్యాలయం వద్ద అందించాలని సూచించారు.

రూ.కోట్లు పెట్టి నష్టపోతామన్న ఆందోళన

బార్ ఏర్పాటుకు రూ.కోట్లల్లో పెట్టుబడి పెట్టాల్సి ఉంది. మున్సిపల్ కార్పొరేషన్‌కు 10 కిలోమీటర్ల లోపు బార్ ఏర్పాటు చేసుకునే వారికి ఒక్కో బార్‌కు ఏడాదికి రూ.70 లక్షల ఫీజు నిర్ధారించారు. నిడదవోలులో రూ.37.50 లక్షలుగా నిర్ణయించారు. కల్లుగీత కార్మికులకు కేటాయించే షాపులకు ఫీజులో 80 శాతం రాయితీ కల్పిస్తారు. నిర్దేశించిన ఫీజు ప్రభుత్వానికి చెల్లించాలి. బార్ నిర్వహణ కోసం భవనం అద్దె కనీసం రూ.లక్ష చెల్లించాల్సి ఉంటుంది. దీనికితోడు అందులో పనిచేసే సిబ్బందికి వేతనాలు, పోలీసు, ఎక్సైజ్ అధికారులకు నెలవారీ మామూళ్లు ఇలా అన్నీ లెక్క గడితే ఏడాదిలో రూ.కోట్లలో పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. అందుకు అనుగుణంగా ఆదాయం వస్తుందా..? రాదా..? అన్న మీమాంస వ్యాపారుల్లో నెలకొంది. దీనికితోడు ప్రభుత్వం తాజాగా మరో నిర్ణయాన్ని అమలు చేస్తోంది. అమ్మకాల్లో ఇంత శాతం ప్రభుత్వానికి చెల్లించాలన్న నిబంధన వ్యాపారుల్లో మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఉదాహరణకు ఏడాదిలో రూ.కోటి రూపాయల విక్రయాలు జరిగితే.. అందులో రూ.10 లక్షలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అప్పులు చేసి పెట్టుబడి పెడితే.. కనీసం వడ్డీ డబ్బులైనా వస్తాయా? లేదా? అన్న ప్రశ్న వ్యాపారుల్లో ఉత్పన్నమవుతోంది. దీంతో మద్యం సిండికేట్ దరఖాస్తు చేయకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది.

సర్కారుపై ఒత్తిడి కోసమే..

కూటమి సర్కారు కాసుల కక్కుర్తితో ఇప్పటికే మద్యం షాపులకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లకు అనుమతులు ఇచ్చేసింది. బార్లను తలపించేలా అమ్మకాలు జరుగుతున్నాయి. మందుబాబులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు అక్కడ కల్పిస్తున్నారు. దీనికితోడు జిల్లాలో ఎక్కడ చూసినా అనధికారిక బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. మందు డోర్ డెలివరీ చేస్తున్నారు. ఎక్కడ చూసినా నిబంధనలకు విరుద్ధంగా మందు విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. మద్యం ఇలా ఏరులై పారుతుంటే.. బార్లకు వచ్చి పని గట్టుకుని మద్యం సేవించే వారి సంఖ్య గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్న వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ప్రభుత్వం బార్ లైసెన్సుల కోసం దరఖాస్తు ఫీజు భారీగా పెంచేసింది. దరఖాస్తుతో చెల్లించే రూ.5 లక్షలు వెనక్కు తిరిగి రావు. తిరిగిరాని దరఖాస్తు రుసుము కూడా అత్యధికంగా పెంచి కట్టించుకోవడం వ్యాపారులకు మింగుడుపడటం లేదు. ఈ నేపథ్యంలోనే సిండికేట్‌గా ఏర్పడిన మద్యం వ్యాపారులు దరఖాస్తు ఫీజు తగ్గించేలా ప్రభుత్వం ఒత్తిడి తేవడానికి ఎక్కువగా దరఖాస్తులు చేయకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం మళ్లీ గడువు పెంచి అవకాశం ఇచ్చినప్పటికీ, ఫీజులు తగ్గించకపోవడంతో మద్యం షాపుల నుంచి బార్ల ఏర్పాటుకు ఎంతమంది వ్యాపారులు ముందుకు వస్తారన్న అంశం ప్రశ్నార్థకంగా మారింది.

గతంలో తీవ్రమైన పోటీ

బార్లంటే గతంలో పోటీ తీవ్రంగా ఉండేది. ఒక్కో బార్‌కు కనీసం 5 నుంచి పది మంది వ్యాపారులు పోటీ పడి మరీ దక్కించుకునే వారు. దరఖాస్తులు సైతం కుప్పలు తెప్పలుగా వచ్చేవి. వ్యాపారులు సిండికేట్ కావడంతో ఒక్కో బార్‌కు ఒకటి చొప్పున కూడా దరఖాస్తులు రాలేదు.

మళ్లీ పెరుగుతున్న గోదావరి ఉధృతి

- నేడు ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరే అవకాశం
- అప్రమత్తమైన ఇరిగేషన్ యంత్రాంగం



కాటన్ బ్యారేజీ నుంచి విడుదల చేస్తున్న మిగులు జలాలు

ధవళేశ్వరం: గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద గోదావరి క్రమేపీ పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో నీటి ఉధృతి పెరుగుతుండటంతో ఆ ప్రభావం ధవళేశ్వరం వద్ద శుక్రవారం ఉదయం నుంచి కనిపించే అవకాశం ఉంది. శుక్రవారం రాత్రికి ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి నీటిమట్టం చేరే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. ధవళేశ్వరం ఫ్లడ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కాటన్ బ్యారేజీ నుంచి గురువారం రాత్రి 5,15,938 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. గురువారం రాత్రి నీటి మట్టం 10.40 అడుగులకు చేరింది. స్థానికంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో డెల్టా కాలువలకు నీటి విడుదలను తగ్గించారు. గోదావరి డెల్టా కాలువలకు సంబంధించి 4,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,600, మధ్య డెల్టాకు 700, పశ్చిమ డెల్టాకు 2,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఎగువ ప్రాంతాలకు సంబంధించి కాళేశ్వరంలో 9.34 మీటర్లు, పేరూరులో 13.42 మీటర్లు, దుమ్ముగూడెంలో 11.18 మీటర్లు, భద్రాచలంలో 38.60 అడుగులు, కూనవరంలో 16.73 మీటర్లు, కుంటలో 12.20 మీటర్లు, పోలవరంలో 10.90 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జ్ వద్ద 14.94 మీటర్ల నీటి మట్టాలు కొనసాగుతున్నాయి.

మహా గణపతిం..

జిల్లాలో వాడవాడలా బుధవారం గణపతి ఉత్సవాలు ప్రారంభమైయ్యాయి. చిట్టి వినాయక బొమ్మల నుంచి భారీ విగ్రహాలు మండపాలలో కొలువుదీరాయి. వివిధ ఆకారాలలో గణపతి విగ్రహాలను మండపాలలో ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాల ఆలంకరణలతో మండపాలను కాంతివంతం చేశారు. రాజమహేంద్రవరంలో పుష్కరఘాట్ రాజమహేంద్రి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 16వ వార్షిక ఉత్సవాల్లో భాగంగా 18 అడుగులు ఎత్తైన శుభంకర మహా గణపతి వినాయకుడి విగ్రహాన్ని నూలు పోగులు, పసుపుతాడుతో రూపొందించారు. స్త్రీ రూపంలో గణపతిని ప్రతిష్ఠ చేయడం ఇక్కడ విశేషం. ఇది శక్తి గణపతి అని, పురాణాలలో దీని ప్రస్తావన ఉందని నిర్వాహకురాలు, వైఎస్సార్ సీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు.

– సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం)



రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద శుభంకర మహా గణపతి

క్రీడాకాశంలో తూరుపు మెరుపులు

- ఆటల్లో మేటిగా గోదావరి క్రీడాకారులు
- జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వేదికగా ఉమ్మడి జిల్లా
- అదే స్థాయిలో పతకాల కైవసం
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం



ఈ ఏడాది ఫిబ్రవరిలో గొల్లవిల్లిలో జరిగిన జాతీయ వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటుతున్న క్రీడాకారులు (ఫైల్)

కపిలేశ్వరపురం: ఆటలు మానసిక, శారీరక ఉల్లాసాన్నే కాకుండా దేశ కీర్తి ప్రపంచ వ్యాప్తం చేస్తాయి. సాధించిన ప్రగతి పది కాలాల పాటు దేశ ఔన్నత్యాన్ని పెంపొందించేలా చేస్తాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడా ఖ్యాతి అంతర్జాతీయ స్థాయిలో వెలుగొందుతోంది. క్షేత్ర స్థాయిలో పాఠశాల స్థాయి నుంచే ప్రభుత్వాలు క్రీడలకు సరైన సదుపాయాలు, అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

జాతీయ క్రీడా దినోత్సవం నేపథ్యమిదీ...

ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో 1905లో జన్మించిన భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జన్మదినం ఆగస్టు 29వ తేదీని జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. దేశ అత్యున్నత క్రీడా పురస్కారం రాజీవ్ గాంధీ ఖేల్ రత్నను ×మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న పురస్కారం₹గా నేటి మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాదిలో అమలాపురానికి చెందిన రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ ఆ పురస్కారాన్ని అందుకోవడం ఉమ్మడి 'తూర్పు' జిల్లాకు గర్వకారణం.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్రీడలకు మహర్దశ

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2023–28 క్రీడా పాలసీ ద్వారా ఆడుదాం ఆంధ్రా క్రీడల సంబరాన్ని నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా 4వేల సచివాలయాల పరిధిలో మూడు లక్షల మ్యాచ్‌లను నిర్వహించింది. గతంలో ఏ ప్రభుత్వమూ ఇవ్వలేనంతగా విజేతలకు నగదు బహుమతులను అందజేసింది. 2023 సెప్టెంబర్ 1 నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో 9 క్రీడా అంశాలపై పోటీలు నిర్వహించింది.

ఉమ్మడి జిల్లాలో ప్రగతి ఇదీ..

- ఈ ఏడాది మార్చిలో గుజరాత్ సూరత్‌లో నిర్వహించిన అంతర్జాతీయ వీల్ చైర్ క్రికెట్ టీ–10 మానస్ కప్ టోర్నీలో ఏపీ జట్టు ప్రతిభ కనబరచగా, 15 మంది జట్టు సభ్యుల్లో ఎనిమిది మంది ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వారే.
- ఈ ఏడాది ఫిబ్రవరి 6 నుంచి 8 వరకూ రాజస్థాన్ అల్వార్‌లో నిర్వహించిన 44వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో అమలాపురానికి చెందిన రెడ్డి నరేంద్రకుమార్, జి.గంగరాజు రన్నింగ్‌లో అంతర్జాతీయ అథ్లెటిక్స్‌కు ఎంపికయ్యారు.
- అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం రామచంద్రపురానికి చెందిన గిరిజన క్రీడాకారిణి కుంజా రజిత మేలో ఆసియా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పరుగు పోటీలో స్వర్ణం సాధించింది.
- ఈ ఏడాది జనవరి 6 నుంచి 9 వరకూ సింగపూర్‌లో నిర్వహించిన ఏషియన్ యోగా పోటీల్లో దేవరపల్లి మండలం చిన్నాయగూడేనికి చెందిన ఇమ్మణి అర్మిత భవానీ చౌదరి ప్రతిభ కనబర్చింది.
- ఈ ఏడాది జూలైలో అమలాపురం మండలం సవరప్పాలేనికి చెందిన సత్తి అక్షయ కర్ణాటక ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ గెలుచుకుని జాతీయ స్థాయికి ఎంపికైంది.
- ఈ నెల 1 నుంచి 12 రోజుల పాటు కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో 15వ జాతీయ జూనియర్ మహిళా హాకీ చాంపియన్‌షిప్–2025 నిర్వహించారు. 2026–27 వరల్డ్ కప్ జట్టు ఎంపికకు 30 మందిని ప్రాబబుల్స్‌గా ఎంపిక చేశారు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 24 నుంచి 26 వరకూ తాడేపల్లిగూడెంలో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో రాజమహేంద్రవరంలోని అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియోపతి కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు.
- ఈ ఏడాది జనవరి 14 నుంచి 17 వరకూ రామచంద్రపురంలో నిర్వహించిన 14వ ఆలిండియా బాస్కెట్‌బాల్ టోర్నీ నిర్వహించారు.
- 2024 డిసెంబర్ 28న వైజాగ్ ఆర్‌కే బీచ్‌లో ప్రారంభమై సముద్రంలో 150 కిలోమీటర్లు ఈదుతూ స్విమ్మర్ గోలి శ్యామల 2025 జనవరి 3 కాకినాడ బీచ్‌కు చేరుకుని అరుదైన రికార్డును సాధించారు.
- ఈ ఏడాది జూలైలో రాజోలుకు చెందిన బండారు అయ్యప్ప, గుడాల దుర్గా శ్రీనివాస్ సురేష్‌కుమార్‌లు ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)కు ఎంపికయ్యారు.
- ఈ ఏడాది మార్చి 23న చెన్నైలో కాకినాడకు చెందిన ఫాస్ట్ బౌలర్ పెన్మత్స వెంకట సత్యనారాయణరాజు ముంబయి ఇండియన్స్ జట్టు తరఫున తన తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడాడు.
- అమలాపురం విక్టరీ అకాడమీకి చెందిన కొండా శివేంద్ర, పితాని రాఘవేంద్ర, సాధనాల శ్రీసంతోష్ చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్ సాధించారు.
- ఈ ఏడాది జనవరి 7 నుంచి 9 వరకూ మండల స్థాయిలోనూ 22 నుంచి 24 వరకూ అమలాపురంలో జిల్లా స్థాయిలోనూ కోనసీమ క్రీడోత్సవం పేరిట విద్యార్థులకు పోటీలను నిర్వహించారు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకూ ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో శివరాత్రి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించింది.



జాతీయ వీల్ చైర్ క్రికెట్ పోటీల్లో ఆడుతున్న రాజమహేంద్రవరం క్రీడాకారులు

న్యాయ నిర్ణేతలుగా..

ఈ ఏడాది జూలైలో వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అథ్లెట్ కమిషన్ సభ్యులుగా రాజమహేంద్రవారానికి చెందిన జాతీయ బీచ్ వాలీబాల్ క్రీడాకారిణి యండమూరి లలితాదేవి ఎన్నికయ్యారు.

- ఈ ఏడాది ఫిబ్రవరి 9–13 మధ్య ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానిలో నిర్వహించిన జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడలకు న్యాయ నిర్ణేతగా కాకినాడ జిల్లాకు చెందిన నాగం సతీష్ నియమితులయ్యారు.
- ఈ ఏడాది జనవరి 28 నుంచి ఫిబ్రవరి 14వరకూ నిర్వహించిన నేషనల్ గేమ్స్‌లో బాల్ బ్యాడ్మింటన్ అంపైర్లుగా అమలాపురం మండలానికి చెందిన అడపా శ్రీనివాస్, గొల్లకోటి శ్రీనివాస్ నియమితులయ్యారు.

దిగ్భ్రాంతి కలిగించిన ప్రముఖుల మృతి

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, అమలాపురానికి చెందిన రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ తండ్రి కాశీ విశ్వనాథ్ ఈ ఏడాది ఫిబ్రవరి 20న మృతి చెందారు. సాత్విక్ ఫిబ్రవరి 21న దిల్లీలో ప్రధాని చేతుల మీదుగా ఖేల్ రత్న పురస్కారాన్ని అందుకునే కార్యక్రమానికి బయలుదేరిన కొద్ది సేపటికే ఆయన గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. మే 1న దిల్లీలో కేంద్ర మంత్రి మాండవీయ చేతుల మీదుగా ఆ పురస్కారాన్ని అందుకోగా ఆ ఘట్టాన్ని తల్లి రంగనాయకి స్వయంగా వీక్షించారు. అమలాపురానికి చెందిన వెటరన్ అథ్లెటిక్ క్రీడాకారుడు బిళ్ళ వీర్రాజు (74) అనారోగ్యంతో ఈ ఏడాది ఏప్రిల్ 14న మృతి చెందారు.

కూటమి పాలనలో తూతూ మంత్రంగా ..

సుమారు ఏడాదిన్నర కూటమి పాలనలో క్రీడలను విస్మరించారు. క్షేత్ర స్థాయిలో మైదానాలను మెరుగుపరచలేదు. 2024 నవంబర్ 20న నూతన క్రీడా విధానం- 2024ను ప్రభుత్వం ఆమోదించినప్పటికీ ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఉమ్మడి జిల్లాలో అథ్లెట్లు సాధన చేసేందుకు సింథటిక్ ట్రాక్, కోచ్ సదుపాయాలు లేకపోవడం ప్రోత్సాహలేమికి ఉదాహరణ.

క్లుప్తంగా

బ్యాటరీ చోరీ నిందితుల అరెస్టు

రూ.2.5 లక్షల విలువైన 20 బ్యాటరీలు స్వాధీనం



ఆలమూరు పోలీసు స్టేషన్‌లో పట్టుబడిన బ్యాటరీలు, నిందితులతో పోలీసులు

ఆలమూరు: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లో వాహనాల్లో బ్యాటరీ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను ఆలమూరు పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్సై జి.నరేష్ కథనం ప్రకారం 216 ఏ జాతీయ రహదారి వెంబడి పలు చోట్ల లారీలు, వ్యాన్లలో బ్యాటరీలు చోరీలకు గురవుతున్నాయంటూ ఆలమూరు, రావులపాలెం, కొత్తపేట పోలీసు స్టేషన్లతో ఐదు కేసులు నమోదయ్యాయి. దీనిపై ఎస్పీ బి.కృష్ణారావు, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆదేశాల మేరకు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ నేతృత్వంలోని బృందం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా చంద్రపాలేనికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2.5 లక్షల విలువైన 20 బ్యాటరీలను, దొంగతనాలకు ఉపయోగించిన వేన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గురువారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా జడ్జి ఇంటూరి రవికిరణ్ వారికి రిమాండ్ విధించారు.

నలుతెరంగులా వ్యవహరిద్దాం!



- సాహితీ ప్రక్రియలలో తెలుగుకు అగ్రస్థానం
- శతాబ్దాల క్రితమే విశ్వవ్యాపితం
- ప్రపంచ వ్యాప్తంగా 10 కోట్ల మంది వినియోగం
- వ్యావహారిక భాషోద్యమానికి సారథ్యం వహించిన 'గిడుగు'
- నేడు తెలుగు భాషా దినోత్సవం

రాయవరం: తెలుగు భాష తీయదనం.. తెలుగు భాష గొప్పదనం.. తెలుసుకున్న వాళ్లకి తెలుగే ఓ మూలధనం.. అన్నాడో సినీ కవి. పంచదారకన్నా.. పాలమీగడ కన్నా, చెరకురసం కన్నా మధురమైనది మన తెలుగు భాష. 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని శ్రీకృష్ణదేవరాయలు ప్రవచిస్తే.. ప్రముఖ చరిత్రకారుడు 'నికోలో డి కాంటీ' తెలుగు భాషను ×ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్×గా పేర్కొన్నాడు. తేనెలొలికే తెలుగుభాష గొప్పదనాన్ని మన కవులు శతాబ్దాల కిందటే విశ్వవ్యాపితం చేశారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలతో పాటుగా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 10 కోట్ల మంది తెలుగు భాష మాట్లాడుతున్నారు. దేశంలో అధికారికంగా గుర్తింపు పొందిన 22 భాషల్లో తెలుగు భాషకు మూలం ద్రావిడ భాష.

'గిడుగు' జయంతిని పురస్కరించుకుని

ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టం ద్వారా 1966లో తెలుగును రాష్ట్ర భాషగా ప్రభుత్వం ప్రకటించింది. మాతృభాషలో జ్ఞానాన్ని పొందకుంటే వ్యక్తిత్వ వికాసం.. మేధాపరమైన ప్రగతి మందగిస్తాయని పలు పరిశోధనల్లో వెల్లడైంది. తెలుగు భాషలోని నుడికారాలు, సామెతలు, జాతీయాలు, లోకోక్తులు ఇలా వేటికవే ప్రత్యేకం. అమ్మ భాషలోనే మన భావోద్వేగాలను సులభంగా వెల్లడించగలుగుతాం. తెలుగు భాష ఉన్నతికి అవిరళ కృషి చేయడంతో పాటుగా, తెలుగుజాతి గొప్పదనాన్ని ఖండాతరాలకు చాటి చెప్పిన బహుభాషా కోవిదుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి (ఆగస్టు 29) సందర్భంగా ఏటా తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం.

లోపిస్తున్న చిత్తశుద్ధి

అతి ప్రాచీన భాషల్లో ఒకటిగా తెలుగును భారత ప్రభుత్వం 2008 అక్టోబర్ 31న చేర్చింది. ప్రాచీన హోదా కల్పించడంతో పాటు ప్రభుత్వం చట్టాన్ని చేసినప్పటికీ అది ఏ మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. తెలుగు భాషను ప్రభుత్వపరంగా ఆచరణలో పెట్టాలని భావించి 1958వ సంవత్సరంలో ఆదేశాలు జారీ చేశారు. అవి అమలు కాకపోవడంతో 1991వ సంవత్సరంలో తెలుగు భాషను ప్రభుత్వం చట్టబద్ధం చేసింది. అయినప్పటికీ అమలు విషయంలో చిత్తశుద్ధి లోపించింది. జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో నేటికీ తెలుగుకు సంబంధించిన నిబంధనలు అమలు కావడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. తెలుగులో రాయడం ఆత్మన్యూనతగా, ఆంగ్ల మాధ్యమంలో చదవడం నాగరికంగా మారిన కారణంగా సొంతగడ్డపైనే తెలుగు పరాయిభాషగా మారిపోయిందని తెలుగు భాషాభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిడుగు వారి కృషితో తెలుగుకు కొత్త వెలుగులు వచ్చినప్పటికీ పాలకుల నిర్వాకంతో అమ్మ భాష రోజురోజుకూ నిరాదరణకు గురవుతోందనే భావనను పలువురు కవులు చెబుతున్నారు. 'తెలుగు భాషా దినోత్సవం' రోజు మాత్రం హంగామా చేస్తున్నారు తప్ప మిగతా రోజుల్లో మాతృభాష అమలు ఊసే ఉండడం లేదు.



తెలుగుతల్లిగా విద్యార్థులు (ఫైల్)

శిష్ట వ్యావహారిక రూపశిల్పి 'గిడుగు'



శిష్ట వ్యవహారికం పేరిట రామ్మూర్తి పంతులు వాడుక భాషలో బోధనకు పెద్దపీట వేశారు. అందుకే ఆయన జన్మదినాన్ని రాష్ట్ర ప్రజలు మాత భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. వ్యావహారిక భాషలో బోధనా ప్రచారం కోసం ఆయన 'తెలుగు' పత్రికను ప్రారంభించారు. ఆయనతో పాటుగా గురజాడ అప్పారావు, శ్రీనివాస అయ్యంగార్ వంటి వారి కృషి ఫలితంగా 1912–13లో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం స్కూల్ ఫైనల్ పరీక్షను వ్యావహారిక భాషలో రాయవచ్చునని ఆదేశాలు జారీచేసింది.

భాషాభిమానంతోనే రోజుకో పద్యం



ఆలమూరు బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. ప్రతి రోజు ఒక సామాజికాంశం, ఆయా రోజుల ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ ప్రతి రోజు 'గౌరీ మల్లిక్' కలం పేరుతో ఒక పద్యం రాస్తాను. అక్షరధనంతోనే అజ్ఞానాన్ని పారదోలగలం. భాషతోనే కీర్తి, స్ఫూర్తి. మానవీయతకు అద్దం పట్టేందుకు కృషి చేస్తున్నా.

– కామవరపు మల్లికార్జునరావు (మల్లిక్), తెలుగు పండిట్, జెడ్పీహెచ్‌ఎస్, కంద్రిగ, ఆలమూరు

నైతిక విలువల బోధన



తెలుగు భాషను మించిన భాష లేదు. మాతృభాష ద్వారానే విద్యార్థుల్లో నైతిక, సామాజిక విలువలను పెంపొందించే అవకాశం ఉంటుంది. పద్యధారణ ద్వారా విద్యార్థుల్లో జ్ఞాపక శక్తి పెరుగుతుంది. తెలుగు భాషపై ఉన్న అభిమానంతో స్వామి వివేకానంద, శారదామాత, రామకృష్ణ పరమహంస, బాలల నాటికలు, చిన్నారి స్నేహితులు(గేయాలు), నేనొక ప్రేమ పిపాసిని (కవితలు) తదితర రచనలు చేశాను.

– కూచిభొట్ల జనార్దనస్వామి, తెలుగు పండిట్, జెడ్పీహెచ్‌ఎస్, ద్రాక్షారామం

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

- ఈటీసీ ప్రిన్సిపాల్ రమణ
- 11 జిల్లాల ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

సామర్లకోట: ఆరోగ్యవంతమైన గ్రామాన్ని నిర్మించాల్సిన బాధ్యత జిల్లా స్థాయి అధికారులపై ఉన్నదని విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ అన్నారు. ఈ కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ, ఏలూరు జిల్లాలోని ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై గురువారం ఆయన శిక్షణ ప్రారంభించారు. ఎంపీడీఓలకు రెండు రోజులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం లేని గ్రామాలు, ఆకలి నిర్మూలన, మంచి ఆరోగ్యం, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, పరిశుభ్రమైన నీరు, పారిశుద్ధ్యం, ఆర్థికాభివృద్ధి వంటి అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. స్థానికంగా సేకరించిన తృణధాన్యాలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ ఆయుష్ మిషన్, ఐసీడీఎస్ అనుబంధ పథకాలు, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, పోషణ్ అభియాన్‌లను పంచాయతీ స్థాయిలో వినియోగించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీలు డి.శ్రీనివాసరావు, కె.సుశీల, ఎస్ఎస్ శర్మ, ఎం.చక్రపాణిరావు, కేఆర్ నిహారిక, పి. రామకృష్ణ, వి.జగన్నాథం, ఎం.రాజ్ కుమార్ శిక్షణ ఇచ్చారు.



వివిధ జిల్లాల అధికారులకు శిక్షణను ప్రారంభించిన వైస్ ప్రిన్సిపాల్ రమణ

భారత్, తైవాన్‌లది బలమైన బంధం

టీఈసీసీ డైరెక్టర్ స్టీఫెన్ షు–చిహ్ హ్సు



సమావేశంలో తైవాన్ ప్రతినిధులతో జీజీయూ యాజమాన్యం

రాజానగరం: భారత్, తైవాన్ దేశాలు ఆర్థిక, సాంకేతిక, రాజకీయ రంగాలలో బలమైన సంబంధాలను కలిగివుండటంతో ఇరు దేశాలు ఎగుమతి, దిగుమతులలో పురోగతిని సాధిస్తున్నాయని చెన్నైకు చెందిన టీఈసీసీ డైరెక్టర్ స్టీఫెన్ షు–చిహ్ హ్సు అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయు)లో గ్రీన్ ఎకానమీ, సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ అండ్ గ్రీన్ టెక్నాలజీలలో కృత్రిమ మేధ (ఏఐ) అంశాలపై గురువారం అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. తైవాన్ నేషనల్ సన్ యాట్–సెన్ యూనివర్సిటీ, తైవాన్ నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ సహకారంతో జరిగిన ఈ సదస్సుకు చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అధ్యక్షత వహించారు. స్టీఫెన్ షు–చిహ్ హ్సు మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో భారత్ నైపుణ్యం కలిగివుంటే, సెమీ కండక్టర్ తయారీలో తైవాన్ ప్రత్యేక అనుభవంతో ఉందన్నారు. ఈ రెండు కలిస్తే అభివృద్ధిలో కొత్త ఒరవడిని తీసుకురావొచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సెమీ కండక్టర్ తయారీ హబ్‌కు ప్రభుత్వ ఆమోదం లభించిందన్నారు. దీని అభివృద్ధికి తైవాన్ సహకరిస్తుందన్నారు. ఈ రంగంలో విద్యార్థులు, అధ్యాపకులకు శిక్షణ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్, ప్రొ చాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ, వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బిక్కవోలు విద్యార్థులు



దుళ్ల అలేఖ్య



బండారు చాందిన శ్రియ



వి.సాయి సింధు



కొల్లి నాగ చైతన్య



సప్పా వీరనాగ సత్యప్రసాద్

బిక్కవోలు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు శుక్రవారం నుంచి మూడురోజుల పాటు ప్రకాశం జిల్లా చేవూరులో జరిగే రాష్ట్ర స్థాయి పదో సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆ పాఠశాల హెచ్ఎం రమాదేవి తెలిపారు. ఆమె గురువారం మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న దుళ్ల అలేఖ్య, బండారు చాందిన శ్రియ, వి.సాయి సింధు, ఎనిమిదో తరగతి విద్యార్థి కొల్లి నాగ చైతన్య, సప్పా వీరనాగ సత్యప్రసాద్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఆయువు తీసిన విద్యుత్ పాశాలు

- విధి నిర్వహణలో ఒకరు..
- ఆట సరదాలో మరొకరు మృతి
- వేర్వేరు ఘటనలలో ఆరుగురికి గాయాలు

పెద్దాపురం: విద్యుత్ స్తంభంపై మరమ్మత్తులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో ఒక లైన్‌మన్ మృతి చెందగా, మరో లైన్‌మన్ తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం పట్టణంలో చోటు చేసుకున్న ఘటనపై సీఐ విజయశంకర్, ఎస్ఐ మౌనిక తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కొండయ్యపేటకు చెందిన ఆరిమిల్లి రామకృష్ణ (35), స్థానిక శివాలయం వీధికి చెందిన యాళ్ల చిన్నిబాబు స్థానిక పాశిలవీధిలో విద్యుత్ లైన్‌కు మరమ్మతు చేస్తున్నారు. ఇంతలో విద్యుత్ షాక్ తగలడంతో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా చిన్నిబాబు తీవ్ర గాయాల పాలయ్యారు. రామకృష్ణకు తండ్రి, తల్లితో పాటు సోదరి ఉన్నారు. చిన్నిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్దాపురం నాలుగో సచివాలయ పరిధిలో జూనియర్ లైన్‌మన్లుగా వారు పనిచేస్తున్నారు. రామకృష్ణ మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చిన్నిబాబును ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించి చికిత్స చేస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



విద్యుదాఘాతంతో మృతి చెందిన లైన్‌మన్ రామకృష్ణ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లైన్‌మన్ చిన్నిబాబు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై వేలాడుతున్న రామకృష్ణ మృతదేహం

సాంకేతిక లోపం వల్లనే..

సంఘటన స్థలం వద్ద లైన్‌మెన్ రామచంద్రరావు, రామకృష్ణ, చిన్నిబాబు ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేశారని, అనంతరం జూనియర్ లైన్‌మన్‌లు పోల్ పైకి ఎక్కి పని చేస్తుండగా పైనున్న ఏ, బీ, సీ బ్లేడ్‌లలో ఏ బ్లేడ్ ఆఫ్ కాకపోవడంతో విద్యుత్ ప్రసరించి రామకృష్ణ మృతి చెందాడని ఏఈ వివరించారు.

వాలీబాల్ కోర్టుకు విద్యుద్దీపాల ఏర్పాటులో..

- స్తంభానికి విద్యుత్ తీగ తగిలి యువకుడి మృతి
- ఐదుగురికి గాయాలు
- పండగ పూట మూలపేటలో విషాదం



చరణ్ (ఫైల్)

కొత్తపల్లి: వాలీబాల్ కోర్టుకు విద్యుద్దీపాలు ఏర్పాటు చేసుకునేందుకు ఇనుప స్తంభం పాతుతుండగా పక్కనే ఉన్న విద్యుత్ తీగ తగలడంతో ఒక యువకుడు మృతి చెందగా ఐదుగురు యువకులు గాయపడ్డారు. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని మూలపేట ఇందిరా కాలనీకి చెందిన ఏడిద అప్పారావు పెద్ద కుమారుడు ఏడిద చరణ్ (18)బుధవారం ఉదయం స్థానిక క్రీడా స్థలంలో స్నేహితులతో కలసి వాలీబాల్ ఆడుకునేందుకు క్రీడా స్థలాన్ని ఏర్పాటుచేసుకుంటున్నారు. ఆ స్థలంలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేసుకునేందుకు ఇనుప స్తంభాన్ని ఏర్పాటు చేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ తీగ తగిలి ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో చరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాలలో అతడు ఇంటర్మీడియెట్ పూర్తి చేశాడు. ఈ ప్రమాదంలో అదే కాలనీకి చెందిన మడికి నిఖిల్, గంపల విష్ణులకు తీవ్ర గాయాలు కాగా ప్రథమ చికిత్స కోసం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో వల్లూరి నాగేష్, పోచంపల్లి ధర్మతేజ, జుత్తుక రవిలకు స్వల్ప గాయాలయ్యాయి. చరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనతో మూలపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఏడిద అప్పారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చరణ్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



వాలీబాల్ కోర్టులో ఏర్పాటు చేస్తున్న ఇనుప స్తంభం

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

సుమారు రూ.6.30 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

ప్రత్తిపాడు: దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను ప్రత్తిపాడు పోలీసులు గురువారం అరెస్టు చేసి సుమారు రూ.6.30 లక్షల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మండలంలోని ధర్మవరం జగనన్న కాలనీలో నివసిస్తున్న గాలి తలుపులయ్య ఈనెల 21వ తేదీన బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన ఇద్దరు ఆగంతకులు ఆ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. సీఐ బి.సూర్యఅప్పారావు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. స్థానిక జాతీయ రహదారిపై గల శ్రీపాదాలమ్మ అమ్మవారి ఆలయం సమీపాన సాయంత్రం 4 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. రాజమహేంద్రవరం క్వారీపేటసెంటర్‌కు చెందిన కొవ్వూరి సునీల్, రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామానికి చెందిన బాలుడిని అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టారు. నిందితుల నుంచి సుమారు రూ.6.30 లక్షల విలువైన 247 గ్రాముల బంగారు గొలుసులు, గాజులు, ఉంగరాలు తదితరాలు, 90 గ్రాముల వెండి వస్తువులు, 3 గ్రాముల ప్లాటినం ఉంగరం స్వాధీనం చేసుకున్నారు. కాగా బాలుడిపై నాలుగు మోటారు బైక్ దొంగతనం కేసులున్నాయన్నారు. వీరు చోరీ చేసేందుకు రాజమహేంద్రవరంలో గంటకు రూ.200 వంతున యమహా ఆర్‌ఎక్స్ 5 బైక్ అద్దెకు తీసుకుని రూ.1,800 చెల్లించినట్లు పోలీసులు తెలిపారు. ఆ వాహనాన్ని సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాల నేరస్తుడిని జువైనల్ కోర్టులోనూ, నిందితుడిని ప్రత్తిపాడు కోర్టులోనూ హాజరుపరచనున్నట్లు ఆయన తెలిపారు.



స్వాధీనం చేసుకున్న వస్తువులను, నిందితుడిని చూపుతున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు

తొగరపాయలో వ్యక్తి గల్లంతు



పల్లి చిట్టియ్య

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక శివారు వీధివారిలంకకు చెందిన పల్లి చిట్టియ్య (65) తొగరపాయలో గల్లంతయ్యాడు. తన నివాసం నుంచి గురువారం ఉదయం తాతపూడి లంక పొలానికి వెళ్లి వస్తుండగా ప్రవాహంలో గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ ఆదేశాలపై ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి, తహసీల్దార్ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎస్డీఆర్ఎఫ్ బృందం తొగరపాయ సమీపంలో పడవలతో గాలించినా ఫలితం లేకపోయింది. ఆచూకీ తెలిసిన వారు మండపేట సీఐకి 94407 96537, అంగర ఎస్సై హరీష్ కుమార్‌కు 94409 00770 నంబర్లలో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.



చిట్టియ్య కోసం గాలిస్తున్న పోలీసులు

మద్యానికి డబ్బులివ్వలేదని తండ్రినే హతమార్చాడు

నిడదవోలు (ఉండ్రాజవరం): మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని ఓ కొడుకు కన్నతండ్రినే కడదేర్చిన ఘటన ఉండ్రాజవరం మండలం దమ్మెన్ను గ్రామంలో చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన కొల్లి కృష్ణయ్య (65) కుమారుడు కొల్లి సుధాకర్ మద్యానికి బానిస అయ్యాడు. వారం రోజులుగా పనులు లేకపోవడంతో తాగడానికి డబ్బులు లేవు. దీంతో మంగళవారం మద్యం తాగడానికి డబ్బులు కావాలని తండ్రిని అడిగాడు. డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో అతడిని తీవ్రంగా కొట్టాడు. దీంతో కృష్ణయ్య అపస్మారక స్థితికి వెళ్లాడు. దీంతో బంధువులు అతడిని తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడనుండి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. కృష్ణయ్య మరో కుమారుడు కొల్లి నాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

వేధింపుల కేసులో భర్తకు జైలు

కాకినాడ లీగల్: అదనపు కట్నం కోసం భార్యను వేధించి ఆమెపై కర్రతో దాడి చేసిన భర్తకు రెండేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కాకినాడ స్పెషల్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎ.నాగమల్లేశ్వరి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తాళ్లరేవు మండలం పెద్దబొడ్డు వెంకటాయపాలేనికి చెందిన చెక్క నారాయణరావుతో వీరవేణికి వివాహమైంది. కొద్ది రోజుల అనంతరం అదనపు డబ్బులు కోసం భార్యను వేధించేవాడు. మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఆమెపై కర్రతో దాడి చేశాడు. వీరవేణి ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి ఎస్పీ తుహిన్ సిన్హా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నారాయణరావుపై నేరం రుజువుకావడంతో డబ్బు డిమాండ్ చేసినందుకు ఏడాది జైలు, రూ.500 జరిమానా, కర్రతో దాడిచేసినందుకు రెండేళ్లు జైలు, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.